
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8, కనిష్ఠం 12.7





● భీంపూర్ మండల సమీపంలో పెన్‌గంగా నదిలో అడుగంటిన నీటిధారలు



● నేరడిగొండ శివారులో అడుగంటిన వాగు

ముంచుకొస్తున్న జల ముప్పు!

- జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- గాదిగూడ మండలంలో అత్యధికంగా 18.30 మీ. లోతులోకి..
- జనవరి చివరి నాటికి జిల్లా సగటు నీటిమట్టం 7.06 మీటర్లు
- వేసవి ప్రారంభంలోనే పరేషాన్ అవుతున్న అన్నదాతలు
- రాబోయే రోజుల్లో ఇబ్బందులు తప్పవంటున్న అధికారులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే జిల్లాలో రికార్డు స్థాయి పగటి ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఫిబ్రవరి ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు 37డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. రాబోయే మార్చి, ఏప్రిల్, మే మూడు మాసాలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకుంటే జలముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ యేడు సమృద్ధిగానే వర్షాలు కురిశాయి. అలాగే అదే స్థాయిలో ఎండల తీవ్రత కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం జిల్లాలో నమోదవుతున్నా.. ఆశించిన స్థాయిలో భూగర్భజలాలు కనిపించడం లేద న్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే జిల్లా భూ ఉపరితలం ఎత్తు పల్లాలతో కూడుకొని ఉండడంతో వర్షపు నీటిని ఒడిసి పట్టే అవకాశం లేక దిగువకు వృథాగా వరదనీరు వెళ్లి పోతోంది. 2024 డిసెంబరు చివరి నాటికి జిల్లా సగటు నీటిమట్టం 6.06 మీటర్లు కాగా, నెల రోజులు గడిచే సరికి జనవరి 31 నాటికి 7.06 మీటర్ల లోతులోకి పడిపోయింది. అంటే నెలకు మీటర్ లోతులోకి భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలలలో మరింత వేగంగా భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉందని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. వేసవి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైతేనే గడ్డు పరిస్థితుల నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గాదిగూడలో ప్రమాదకర పరిస్థితి

వేసవి ప్రారంభంలోనే గాదిగూడ మండలంలో ప్రమాదకర పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికే వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటుక పోవడంతో సాగుతో పాటు తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

: శ్రీవల్లి, భూగర్భజల శాఖ అధికారి, ఆదిలాబాద్



వేసవి పరిస్థితుల దృష్ట్యా ప్రతీఒక్కరు నీటిని మరింతగా పొదుపుగా వాడుకోవాలి. గతేడుతో పోల్చుకుంటే భూగర్భజలాలు ఈసారి మరింతగా పడిపోయాయి. వేగంగా నీటిమట్టం పడిపోవడం కనిపిస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ మండలాల్లో పరిస్థితి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ప్రతీ ఒక్కరు విధిగా ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. చెరువు లు, చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశం ఉంటుంది.



బజార్‌హత్నూర్‌లో భూగర్భజలాల పరిస్థితిని చూపుతున్న రైతు(ఫైల్)

జిల్లాలో అత్యధికంగా 18.30 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోవడం ఆందోళన రేపుతోంది. జైనథ్ మండలంలో 2.65 మీ. లోతులో పైపైనే నీటిమట్టం కనిపిస్తుండగా.. గాదిగూడ మండలంలో భూగర్భజలాలు పాతాళంలోకి పడిపోయాయి. అలాగే బోరజ్ మండలంలో 13.10, బోథ్‌లో 9.10, నేరడిగొండలో 9.85, ఇచ్చోడలో 8.10, సిరికొండలో 7.65 మీటర్ల లోతులోకి భూగర్భ జలమట్టం పడిపోయింది. ప్రస్తుతం జిల్లాలో 37 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో

(తరువాయి 6వ పేజీలో...)



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ శ్యామల దేవి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను విన్నవిస్తున్న దరఖాస్తులు అందించగా వాటిని పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై 77 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ సమస్యల పరిష్కరం కోసం ప్రజలు ఇచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా అధికారి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఆపై చదువుతున్న 2024-25 విద్యా సంవత్సరం ఉపకార వేతనాలకు ఈ-పాస్ ఆన్‌లైన్ రిన్యువల్, ఫ్రెష్ పోస్టుమెట్రిక్ విద్యార్థిని విద్యార్థులు మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి బి.సునితకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా జిల్లాలో అర్హత గల ఎస్సీ, విద్యార్థినీ, విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఉపకార వేతనాలు పొందేందుకు ఎస్ఎస్సీ మెమో, ఆధార్ కార్డులలోని పేరు సరిపోవాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎస్సీ మెమో ప్రకారం ఆధార్‌లోని పేరు సరిపోలకుంటే ఎస్ఎస్సీ మెమోలో మాదిరిగా సవరించుకోవాలని సూచించారు. ప్రాథమిక దరఖాస్తు అనంతరం మీ సేవ కేంద్రాల్లో విద్యార్థులు బయోమెట్రిక్ ధ్రువీకరించుకోవాలన్నారు. అనంతరం తుది దరఖాస్తు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో పూర్తి చేయాలని, డెమోఅథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని ధ్రువపత్రాలు జతపరిచి సంబంధిత కళాశాల యజమాన్యాలు ఈ దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారులకు డిజిటల్ కీ ద్వారా మార్చి 31లోపు పంపించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి

క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి : జిల్లా వైద్య శాఖాధికారి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ముత్నూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిక్షయ్ శివిర్‌ను వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం గురించి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, గళ్ల పడటం లాంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ పరీక్షలన్నీ ఉచితంగా చేస్తామన్నారు. ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలుంటే అశ్రద్ధ చేయకుండా టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సంబంధిత రోగులకు ఉచితంగా టీబీ మందులు పంపిణీ చేస్తామన్నారు. పౌష్టికాహారం కోసం నగదు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూజిత, సీహెచ్ఓ సందీప్, హెచ్ఈవో నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, తదితరులున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన కౌడాల

తాంసి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కౌడాల సంతోష్ హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్తడి వాగు డి-1, డి-2 కెనాల్ల మరమ్మతు, ఇందిరమ్మ ఇల్లు, రోడ్ల సౌకర్యం, మండల అభివృద్ధికి సహకరించాలని ఆయనతో విన్నవించారు. అనంతరం స్థానిక సంస్థ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై విక్రమార్కతో చర్చించినట్లు సంతోష్ పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తిస్థాయిలో విజయం సాధించాలని సూచించినట్లు సంతోష్ వివరించారు. మత్తడి వాగు ప్రాజెక్టును కూడా త్వరలోనే సందర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఉప ముఖ్యమంత్రితో మండల కన్వీనర్ కౌడాల సంతోష్



సమావేశంలో పాల్గొన్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కంది

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, విప్ ఆది శ్రీనివాస్‌లను కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కంది శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

నేడు 'వెడ్మ' ఆధ్వర్యంలో సదస్సు

ఉట్నూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆలోచన మేరకు ఏర్పాటు చేస్తున్న వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతను మేల్కొల్పడానికి మంగళవారం ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణం సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ప్రేరణాత్మక సదస్సు నిర్వహిస్తున్నారు. 'వ్యక్తిత్వ నిర్మాణం, విజయానికి సోపానం' అనే అంశంపై బ్రదర్ షఫీ ఆధ్వర్యంలో ప్రేరణాత్మక ప్రసంగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో యువతీ, యువకులు హాజరై గొప్ప విషయాలను తెలుసుకోవాలని, మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో అభివృద్ధిలో రాణించాలని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐటీ టవర్ పనులను పూర్తి చేయండి : మాజీ మంత్రి

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్‌ను సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 2022లో ఐటీ టవర్ కు పునాదులు వేసి పనులను ప్రారంభించినా.. నిధుల కొరతతో ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదన్నారు. ఐటీ టవర్ పనులు పూర్తికాక పోవడంతో ప్రస్తుతం ఐటీ కంపెనీలు ప్రైవేట్ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బ్యాలెన్స్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు మరిన్ని ఐటీ పరిశ్రమలు వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు తమవంతు సహకారం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రామన్న

మాయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు.. మైలారపు అడెల్లు క్షేమమేనా!?

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జోరుగా చర్చ
- ఇంకా ధ్రువీకరించని పోలీసులు



వివరాలు 7వ పేజీలో...



కుచలాపూర్ గ్రామంలో శబరిమాత పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే



నేరడిగొండలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనిల్ జాదవ్

దైవచింతనతో మానసిక ప్రశాంతత

● బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు దైవ చింతన అవసరమని, అదేవిధంగా ఆశ్రమాల అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానని బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లకీ సేవలో పాల్గొన్నారు. పల్లకీని భుజంపైన పెట్టుకుని మోశారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి తన దినచర్యాలతో సతమతమవుతున్నారని, అయితే జీవితం యంత్రంగా మారిందని, ప్రశాంతత కోసం దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయన వెంట బోథ్ నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్ ప్రీతం రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ చంద్రమోహన్, డాక్టర్ స్వామి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సోనాల మాజీ సర్పంచ్ సదా నందం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● కళాశాల అడ్మిషన్ల పోస్టర్ల విడుదల

నేరడిగొండ: ఇచ్చోడ మండల కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సరస్వతి, మధు, అనిత, మురళీ, ప్రభాత్‌రావు, సరితా రావుచ, దయాకర్, విజయకుమార్, నర్సయ్య, తిరుపతి, సుభాష్, స్వప్న, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఘట్టం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100
- ఉపాధ్యాయుల స్థానానికి 18
- నేడు పరిశీలన
- 13న ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లను స్వీకరించారు. పట్టభద్రుల స్థానానికి 100, ఉపాధ్యాయ స్థానానికి 18 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా 27న పోలింగ్ నిర్వహించనున్నారు. అయితే వరుసగా రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలు రావడంతో సోమవారం ఎక్కువ మంది నామినేషన్లు వేస్తారని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం భారీగా బందోబస్తు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డితోపాటు పలువురు అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీగా వచ్చి నామినేషన్లను దాఖలు చేశారు. ఒక్క సోమవారమే పట్టభద్రుల స్థానానికి 51, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది నామినేషన్లు వేశారు.. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. టీపీసీసీ చైర్మన్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అలాగే ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ నామినేషన్ దాఖలు చేశారు. పట్టభద్రుల స్థానానికి పోటీచేస్తున్న పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లను సమర్పించారు. ఉద్యమకారుడు, కేసీఆర్ అభిమాని పిడిశెట్టి రాజు సైకిల్‌పై కలెక్టరేట్ వరకు చేరుకొని సాధాసీదాగా పట్టభద్రుల స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి టీపీటీఎఫ్ అభ్యర్థి వై.అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితోపాటు మరికొంత మంది అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లను అందజేశారు. అంతేకాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీదర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ వాహనాలను కలెక్టరేట్‌లోకి అనుమతించడాన్ని తప్పుబడుతూ అడ్డుకున్నారు.



మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి

కాగా, పోలీసులు చేరుకొని మంత్రులను వాహనాల నుంచి దింపివేయడంతో వివాదం సద్దుమణిగింది. ఈనెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమగా నామినేషన్ వేసిన వారిలో పట్టభద్రుల స్థానం బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్ టికెట్ ఆశించి చివరి వరకు ప్రయత్నంచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన గంగాధర్, ఆదిలాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థి వై.అశోక్‌కుమార్, తదితరులు ఉన్నారు. మంగళవారం నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, 27న ఎన్నికలు, మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఉంటాయని వివరించారు.



పిప్పల్‌కోటిలో వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మిక బాటతో అభివృద్ధి : ఎమ్మెల్యే

భీంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాలలో ఆధ్యాత్మిక బాట అవసరమని దాంతో ప్రశాంతత అభివృద్ధి సాధ్యమవుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఆయన పిప్పల్‌కోటి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాగా, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. తర్వాత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ మండల అధ్యక్షుడు అంకం అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంట నందయ్య, న్యాయవాది కేమ శ్రీకాంత్, సభ్యులు అల్లూరి రాంరెడ్డి, మండ వెంకట రమణారెడ్డి, అకిటి అశోక్‌రెడ్డి, కేమ గంగయ్య, తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో విద్యా సంస్థల పరిశీలన

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత విద్యా సంస్థల గుర్తింపులో భాగంగా సోమవారం జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమం అధికారి శ్రీధర్ ఆదిలాబాద్‌లోని పలు విద్యా సంస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రహిత విద్యా సంస్థల గైడ్‌లైన్స్ అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. పొగాకు రహిత విద్యా సంస్థల మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ గెజిటెడ్-2 పాఠశాల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌తో సమావేశమయ్యారు.

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

నేరడిగొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన చౌలమద్ది రంజిత్ కుటుంబ సభ్యులు, వారి తండ్రి దివంగత చౌలమద్ది చిన్న నర్సయ్యగా పేరు మీద ప్రాథమిక పాఠశాల తేజాపూర్ గురుకుల శిక్షణ విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్స్‌ను సోమవారం అందజేశారు. ముఖ్య అతిథులుగా నేరడి గొండ జడ్పీఎస్ఎస్ హెచ్ఎం ఎంఈవో భూమారెడ్డి, ఎంపీపీఎస్ హెచ్ మణిలత సంతోష్, శ్రీనివాస్‌గౌడ్, పోతారెడ్డి, పద్మ నాభరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చౌల మద్ది గంగయ్య, రమేష్, అశోక్, రాజేశ్వర్, వినోద్, ప్రశాంత్, బాబు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

భీంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఓటరు జాబితాను సోమవారం భీంపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, ఎంపీవో సమీర్ అహ్మద్‌లు సిబ్బందితో కలిసి ఓటరు జాబితాను ప్రదర్శించారు. వీటిని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరేందర్, సాయి, మజార్, సతీష్‌లు ఉన్నారు.

పిప్పల్‌కోటిలో గ్రంథాలయం ప్రారంభం

భీంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటిలో సోమవారం మన పల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఎంఈవో శ్యామ్ సుందర్, ప్రముఖ న్యాయవాది కేమ శ్రీకాంత్, డాక్టర్ కల్లెం వెంకట్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బద్దం నర్సింగ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ దాసరి రమేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతి యువకుల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయంలో వచ్చి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, జలిగిరి మల్లేష్, షేక్ అఫ్రోజ్, కదిగి వెంకట్, రిటైర్డ్ అధికారులు, గడ్డం పరవనంద్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గన్నీ బ్యాగ్స్



ఇప్పపువ్వు గిడ్డంగిని పరిశీలిస్తున్న చైర్మన్ కోట్నాక్ తిరుపతి

అంతుచిక్కని ప్రమాదం.. లక్షల్లో నష్టం

● అగ్ని ప్రమాదంపై శాఖపరమైన విచారణకు చైర్మన్ ఆదేశం

ఉట్నూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని ఇప్పపువ్వు గిడ్డంగిలో జరిగిన విషయం అంతు చిక్కడం లేదు. ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గిరిజన సహకార సంస్థ అధికారులు నిర్వహించిన ఖాళీ సంచులతో పాటు ఇప్పపువ్వు నిల్వలు ఉన్నాయి. 80వేల ఖాళీ సంచులకు టెండర్ నిర్వహించామని, గుంటూరుకు చెందిన వ్యాపారి టెండర్ దక్కించుకున్నారని, గిడ్డంగి నుంచి తీసుక వెళ్లాల్సి ఉండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ రామనందం తెలిపారు. హైదరాబాద్‌లో సమావేశానికి వెళ్లిన ఆయన హుటాహుటిన సోమవారం ఉదయం చేరుకున్నారు. అగ్ని ప్రమాద సంఘటన స్థలంలో ఆయన వచ్చిన సమయంలో కూడా ఖాళీ సంచులు కాలినప్పటికి ఇంకా పొగలు వస్తున్నాయి. తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తూ పోకిరిల పని అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గిడ్డంగి వెనుక ప్రాంతంలో ప్రతీరోజు పోకిరిలు పేకాట ఆడుతు కాలక్షేపం చేస్తూ ఉంటారని వారు బీడీలు తాగి గిడ్డంగిలో పారేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. సుమారు రూ.20 లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికే పోలీసులకు సమాచారం ఇచ్చామని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, సబ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌లు సందర్శించి వెళ్లారని తెలిపారు.

● శాఖ పరమైన విచారణ జరిపిస్తాం

కాగా, గిరిజన సహకార సంస్థ ఇప్పపువ్వు గోదాముకు నిప్పు అంటుకున్న సంఘటనలను తెలుసుకున్న గిరిజన సహకార సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి సోమవారం సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అగ్ని ప్రమాద సంఘటన జరగడం బాధకరమని, సంఘటనపై ఉన్నత అధికారులతో శాఖపరమైన విచారణ జరిపిస్తామని అన్నారు. ఆయన వెంట డివిజనల్ మేనేజర్ రామానందం ఉన్నారు.



బెల్గావ్ సప్తాహలో పాల్గొన్న మహిళలు, భక్తులు

సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలి

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరు తమకు ఉన్న చేడు వ్యసనాలను విడి బ్రహ్మనిష్ఠ సద్గురు బాజీరావ్ బాబా చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి సతిమణి కంది సాయి మౌన రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బెల్గావ్ గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావ్ బాబా సప్తాహం ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బాజీరావ్ బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బెల్గావ్ గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పొలాల్లో వ్యవసాయ అధికారుల సర్వే

బోథ్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రబీ పంటల సర్వే కొనసాగుతుంది. బోథ్ పరిసరాలలో సోమవారం మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి కృష్ణ సర్వే నిర్వహించారు. రోజుకు 200 ఎకరాలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని, రైతులు సర్వేకు సహకరించాలని పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

బోథ్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌పై సోమవారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్ వలలో చిక్క వద్దని సైబర్ క్రైమ్ మోసాలను తమ ఇళ్లలో తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. అపరిచితుడు ఫోన్లు చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని ఈ యాప్‌లో ఓపెన్ చేయవద్దని సూచించారు. స్థానిక ఎస్సై ప్రవీణ్‌తో పాటు కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట 'మాంగ్' ఆందోళన

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం మాంగ్ కులస్తులు ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో మాంగ్ కులాన్ని గ్రూప్-1 నుంచి తొలగించి గ్రూప్-2లో చేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. గ్రూప్-1లో మాంగ్ కులస్తులను చేర్చడం అన్యాయమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ 59 కులాలకు విభజించి రిజర్వేషన్‌లు పంపిణీ చేయాలన్నారు.

'రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెస్తాం'

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తామని పార్టీ మండలాధ్యక్షుడు లోక కరుణాకర్ రెడ్డి అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ గెలుపొందిన సందర్భంగా సోమవారం మండలకేంద్రమైన బస్టాండ్ ఆవరణలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు కట్కం రాందాస్, కాళ్ల మోహన్, కిసాన్ మోర్చా జైనథ్ మండలాధ్యక్షుడు ఎనుగు రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న జలముప్పు!

(5వ పేజీ తరువాయి...)

పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే వాగులు, ఒర్రెలు, చెరువులు, కుంటలు, బోరుబావులు అడుగంటుక పోతున్నాయి. మారుమూల ఏజెన్సీ మండలమైన గాదిగూడలో భూగర్భజలాలు పడిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిపోతున్న నీటి వినియోగం

నీటి వినియోగం మరింతగా పెరిగిపోవడంతో భూగర్భజలాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో నిత్యం ఒక వ్యక్తి తలసరి నీటి వినియోగం 80లీటర్లు కాగా, 100 లీటర్లకు పైగానే వినియోగిస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. గతేడుతో పోల్చుకుంటే ఈ యేడు జిల్లా సగటు నీటి మట్టం మరింతగా పడిపోయింది. కొన్ని మండలాల్లో ప్రమాదకరస్థాయి కి చేరుకుంటోంది. ఉష్ణోగ్రతలు పెరుగడంతో నీటి వినియోగం కూడా విపరీతంగా పెరిగిపోతోంది. మార్చి, ఏప్రిల్, మే మాసాలలో నీటిఎద్దడి సమస్య మరింతగా తలెత్తే అవకాశం ఉందంటున్నారు. ప్రజల్లో ముందస్తు అవగామన కల్పిస్తూ అవసరమైన చర్యలు చేపడితేనే నీటి ఎద్దడికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉందంటున్నారు. అంతేకాకుండా వేసవి కాలం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పంటలను కాపాడుకునే ప్రయత్నం

రబీలో సాగు చేసిన పంటలకు సరిపడా సాగునీరు అందక పోవడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని బోరుబావులు అడుగంటడంతో కొత్తగా బోరుబావులను తవ్విస్తున్నారు. అయినా చుక్కనీరు కనిపించక రైతులు ఆవేదనకు గురవుతున్నారు. సమీపంలో ఉన్న చెరువులు, ఒర్రెలు, నదులపై ఆధారపడి సాగు చేస్తున్న పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే కొంతమంది రైతులు సాగునీరు అందడం లేదని పంటలను వదిలేసిన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది నుంచి కి.మీ. మేర పైపులైన్ల ద్వారా సాగు నీటిని తరలిస్తూ పంటలకు అందిస్తున్నారు. రబీలో మొక్కజొన్న, జొన్న, శనగ, గోధుమ పంటలనే రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. దాదాపు శనగ పంట చేతికి వచ్చినా.. మిగితా పంటలకు నీటితడులను అందించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

బెల్గావ్‌లో అక్రమ దేశీదారు పట్టివేత

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్గావ్ గ్రామంలో విచ్చలవిడిగా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నిషేధిత దేశిదారు సీసాలను ఎస్సై వి.పురుషోత్తం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. ఎస్సై వి.పురుషోత్తం వివరాలు ఇలా ఉన్నాయి.. బెల్గావ్‌లో మెస్రం పోచ్చిరాం పాన్ షాప్‌పై రైడ్ చేయగా 90ఎంఎల్ గల 192 దేశిదారు సీసాలు ఉన్నాయి. వీటి విలువ రూ.5184గా దేశిదారు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బెల్గావ్ గ్రామంలో అమ్ముతున్న మెస్రం పోచ్చిరాంపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో మండల ఏఎస్సై ఆత్మరాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ల అందజేత

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందవద్దని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుక్కొని తిరిగి అప్ప చెప్పడం జరుగుతుందని ఏఎస్పీ సురేందర్ రావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలో 9 మంది, జైనథ్ పరిధిలో ఏడుగురు ఇటీవల సెల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు ఫోన్‌లను సోమవారం ఏఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, జైనథ్ ఎ.పురుషోత్తం పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారిని తులసికి సన్మానం

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 నేషనల్ క్రికెట్‌లో మండలంలోని కరంజి గ్రామానికి చెందిన తులసి ఇటీవల ఎంపికైంది. కాగా, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి తులసి, వారి తల్లిదండ్రులను పూలమాల, శాలువాతో సన్మానించారు.

మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీల్లో పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీల్లో ఆస్తి, వాణిజ్య, నీటి, వ్యాపార ప్రకటనల పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పన్ను వసూలు లక్ష్యం ఇప్పటి వరకు పూర్తి చేసిన వసూలు వివరాలను మున్సిపాలిటీల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధిక మొత్తంలో పన్ను చెల్లించని వారి జాబితాను సిద్ధం చేసి, నోటీసులను జారీ చేయాలన్నారు. ప్రభుత్వ వాణిజ్య సముదాయాల అద్దెలు వసూలు చేయాలన్నారు. వాణిజ్య లైసెన్స్‌ల పునరుద్ధరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో పెంచుతున్న నర్సరీలకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణాల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించాలని, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలనుకున్న వారు ముందస్తు మున్సిపల్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసాల మున్సిపల్ కమిషనర్‌లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్‌కృష్ణ, రాజేష్‌కుమార్‌లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు, డీఈలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

కుంటాల, ఫిబ్రవరి, 10 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బేటి బచావో- బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కుంటాల మండలంలోని కల్లూరు కస్తుర్బా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక కేటాయింపులను ఏర్పాటు చేసిందని అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక వసతిగృహాలు ఏర్పాటు చేయడంతో పాటు కస్తుర్బా బాలికల పాఠశాలను ఏర్పాటు చేసిందని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని, ప్రతీ విద్యార్థిని తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఎదురయ్యే సమస్యలను అధిగమించే విధానంపై చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికలు మనోధైర్యంతో ముందు కెళ్లాలని, కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నాగలక్ష్మీ, డీసీపీవో మురళి, శక్తి కోఆర్డినేటర్‌లు సవిత, శైలజ, మౌనిక, జ్యోతి, ఐసీపీఎస్ సిబ్బంది శైలజ, చైల్డ్ లైన్ సిబ్బంది పద్మావతి, ఇంచార్జీ ప్రిన్సిపల్ సంధ్యారాణితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

భైంసా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పారిశుధ్య నిర్వాహణ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ భైంసా మున్సిపల్ అధికారి యంత్రాంగానికి సూచించారు. సోమవారం భైంసా పట్టణ పరిధిలో మున్సిపల్ కమీషనర్ రాజేష్ కుమార్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ అనీస్ అహ్మద్‌తో కలిసి . వివిధ వార్డుల పరిధిలో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య వ్యవస్థను పర్యవేక్షించారు. అంతర్గత, ప్రధాన రోడ్లను ప్రతి రోజు క్రమం తప్పకుండా శుభ్ర పరచాలని పేర్కొన్నారు. మురికి కాలువల్లో పూడిక , చెత్త, చేదారం పేరుకపోకుండా తొలగింపులను చేపట్టాలన్నారు. వ్యర్థాల నిల్వలు లేకుండా చూడాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

భైంసా రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెండ్‌పెల్లి గ్రామంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. గ్రామంలో వీధుల గుండా తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులను తగు ప్రశ్నలు అడిగి వారు సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోజాం హుస్సేన్, ఏపీవో శివ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీ



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఈసీ సభ్యులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు జాదవ్ పశురాం, సునీల్ కుమార్, యాదవ్ రవి కిరణ్ సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు గత రెండు రోజుల నుండి జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రాక్టికల్ చేసే తీరు కెమెరాలో నిక్షిప్తం అవుతున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావివ్వరాదని కళాశాల సీఎస్ గౌతమ్, ఎగ్జామినర్ సుధీర్ రెడ్డి, నర్సయ్య విద్యార్థులకు సూచించారు. ఈ తనిఖీలో కళాశాల చీఫ్ సూపరింటెంట్ గౌతమ్, డీఈఎల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. సోమవారం చిట్యాల, దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణను కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో బోధన కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనసూయ, శ్రీలత పాల్గొన్నారు.

ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు



కడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కుంగ్‌ఫు కరాటే ఛాంపియన్షిప్‌లో మండలంలోని లింగాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. పాఠశాలకు చెందిన కాసుల రక్షిత గోల్డ్ మెడల్ సాధించగా, ఎం. సాహిత సిల్వర్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్లు మనోహర్, ఆరిఫ్ ఖాన్, విహారి తెలిపారు.

లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించాలి

పెంబి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శెట్‌పల్లి, యాపల్‌గూడ, రాంనగర్ గ్రామాల ప్రజలకు రేషన్ బియ్యం అందించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు శెట్‌పల్లి, యాపల్‌గూడ, రాంనగర్ గ్రామ ప్రజలతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత కొన్ని నెలల నుంచి లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందడం లేదని, రేషన్ బియ్యం అందక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలో కూడా రేషన్‌బియ్యం ఇవ్వడం లేదని అధికారులకు చెప్పిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులు అందించి వారికి కూడా రేషన్ బియ్యం అందించాలని కోరారు. వెంటనే అధికారులు స్పందించి లబ్ధిదారులకు బియ్యం అందించాలని, లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏ. నాగరావు, వివిధ గ్రామ ప్రజలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

● పార్టీ అ ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ రాంరావ్



భైంసా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాలు, పకడ్బందీ చర్యలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు ముందుకు సాగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల అసెంబ్లీ స్థాయి పార్టీ వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులన్నీ కార్యోన్ముఖులుగా కావాలన్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణం అన్ని విధాలుగా బీజేపీకి అనుకూలంగా మారిందన్నారు. దీనికి తోడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ సర్కార్ పట్ల అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయభేరి మోగించిన నేపథ్యంలో ఉపాధ్యాయ లోకంతో పాటు పట్టభద్రులంతా బీజేపీ వైపు దృష్టి సారించారని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి శుభ తరుణాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే దిశగా పయనించాలన్నారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజక వర్గ పరిధిలోని వివిధ మండలాలకు నూతనంగా ఎన్నికైన పార్టీ మండలాల అధ్యక్షులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్‌ల నేతృత్వంలో ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు.

రైస్ మిల్లులపై అధికారుల దాడి

● లక్ష్మణచాంద మండలంలో 3011 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం అయినట్లు నిర్ధారణ ● కేసు నమోదు



తిరుపెల్లి రైస్ మిల్లులలో విచారణ చేస్తున్న అధికారులు



మిల్లుల నుండి అక్రమంగా వరి ధాన్యాన్ని తరలిస్తూ పట్టుబడిన లారీ

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపెల్లి గ్రామంలో గల ప్రతిమ, శ్రీ నిర్వహణ రైస్ మిల్లులలో దాదాపు ఏడు కోట్ల రూపాయల విలువైన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) మాయమైన సంఘటన సోమవారం వెలుగుచూసింది. డీఎస్‌వో కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ రైస్ మిల్లులలో అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం అందగా ఏఎస్పీ రాజేష్‌మీనా ఆదేశాలతో సివిల్ సప్లై, పోలీస్ అధికారులు సంయుక్తంగా అకస్మాత్తుగా దాడి చేశారు. అక్రమంగా తరలించటం కోసం టీఎస్ 18 టీ 8887, టీఎస్ 18 టీ 2616 నెంబర్ గల లారీలలో 1500ల వరి ధాన్యం బస్తాలను లోడ్ చేసినట్లు సిద్ధంగా ఉంచగా వాటిని పట్టుకున్నారు.

అనంతరం రైస్‌మిల్లుపై రెండు రైస్‌మిల్లులలో సోదాలు నిర్వహించగా 30 వేల 112 క్వింటాళ్లకు పైగా సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. వీటిని ప్రభుత్వ ధరలలో లెక్కించగా 6 కోట్ల 93 లక్షల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయినట్లు తెలిసింది.

ఇంకా పక్కాగా లెక్కిస్తే ఏడు కోట్లకు పైగా ధాన్యం మాయమై ఉంటదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రెండు లారీలను పోలీసు కస్టడీ ద్వారా ఇతర రైస్‌మిల్లులకు పంపారు. దీంతో రూపాయలు ఏడు కోట్ల సీఎంఆర్ ధాన్యాన్ని కూడా ఇలాగే అక్ర మంగా తరలించి సొమ్ము చేసుకున్నారనే అభిప్రాయాలకు బలం చేకూ రింది. ఈ రెండు రైస్ మిల్లులకు సంబంధించిన యజమాని హన్మంత్ రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు డీఎస్‌వో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్య క్రమంలో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై సుమ లత, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) కార్తీక్‌రెడ్డి, పోలీస్ కాని స్టేబుళ్లు సంతోష్, నరేష్, తదితరులు ఉన్నారు.

శంభో.. శివ శంభో!

● నందిగామలో ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపురం గ్రామపంచాయతీ పరిధిలోని నందిగామ గ్రామంలో మాజీ డిసిపిబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి దాదాపు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన శివాలయం, నూతన శివలింగం. నందీశ్వరులను గత మూడు రోజులుగా వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి సోమవారం రోజున ఉదయం నాలుగు గంటలకు నూతన శివాలయాన్ని ప్రారంభించి ఆలయంలో శివలింగం. నందీశ్వరుడు.. ధ్వజస్తంభం, శివపార్వతుల కళ్యాణం, యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో నందిగామ శివాలయ ప్రాంతం శివ నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత నిధులతో నూతన శివాలయం వికర ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ముడుపు భూమారెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి, మోనిష్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి, నందిగామ గ్రామస్తులు, పటేల్ మజాన్ యువజన సంఘాల సభ్యులను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని కోరారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న నందిగామ అడెల్లి పోచమ్మ రోడ్డును. త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపడతానన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో బరంపూర్ గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఆలయంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్ పీఎస్ఏ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మొట్టే కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్ పోచన్న, రమేష్ రెడ్డి, కేద్రేశ్వర్ రెడ్డి. కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎలుగు చంటి, కంది నరసింహులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


నందిగామలో నూతనంగా ప్రతిష్ఠించిన శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తూ..



ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు


పురాతన ఆలయం నంది నుంచి వస్తున్న నీరు

ఫటా.. ఫట్...

జీసీసీని బలోపేతం చేస్తాం

● కోట్నాక తిరుపతి, చైర్మన్ గిరిజన సహకార సంస్థ



ఆంధ్రజ్యోతి: గిరిజన సహకార సంస్థను ఎలా అభివృద్ధి చేస్తారు...?

చైర్మన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అప్పటి ప్రభుత్వం పాలక మండలిని ఏర్పాటు చేయలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తనను చైర్మన్‌గా నియమించి అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : బలోపేతం చేయడానికి ఇలాంటి కృషి చేస్తున్నారు...?

చైర్మన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గిరిజన సహకార సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను తెలపడం జరిగింది. బలోపేతం చేయడానికి గిరిజన సహకార సంస్థకు ప్రభుత్వం తరఫున నిధులు ఇవ్వాలని కోరాము.

ఆంధ్రజ్యోతి : గిరిజన సహకార సంస్థలో ఉద్యోగుల కొరత ఎలా తీరుస్తున్నారు?

చైర్మన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి ఇప్పటికే 64 మంది జూనియర్ అసిస్టెంట్‌లను నియమించడం జరిగింది. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లు శిక్షణలో ఉన్నారు. మేనేజర్ల నియామకం కోసం కూడా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : గిరిజనులకు ఎలాంటి సేవలు అందిస్తారు?

చైర్మన్: జీసీసీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డీఆర్ డిపోలకు సేల్స్‌మెన్లను నియమించి డీఆర్ డిపోల ద్వారా కేవలం రేషన్ సరుకులు ఇవ్వడమే కాకుండా గిరిజనులకు అందుబాటులో ఉండాల్సిన సరుకులను ఉంచి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

● (ఆంధ్రజ్యోతి, ఉట్నూర్)

గొలుసు కట్టు.. స్కూటీ పట్టు!

● జిల్లాలో జోరుగా అనుమతి లేని వ్యాపారం


ఎలక్ట్రిక్ స్కూటీ

బోథ్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్కూటీల గొలుసు కట్టు వ్యాపారం జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. ఎలక్ట్రిక్ స్కూటీల తయారీ కంపెనీలు తమ తమ వ్యాపార అభివృద్ధి కోసం గొలుసు కట్టు వ్యాపారాన్ని ఎంచుకున్నాయి. ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయ కొనసాగుతుంది. స్కూటీ కొనాలనుకున్న వారు పదివేల రూపాయలతో మెంబర్ షిప్ తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత అదే వ్యక్తి మరో ఐదుగురితో రూ.15 వేల చొప్పున చెల్లించే ఈ విధంగా చూడాలి. ఆ ఐదుగురు రూ.15 వేలు కడితే మొదటి వ్యక్తికి స్కూటీని ఫ్రీగా ఇస్తున్నారు.

● గొలుసు కట్టు ఇలా..

స్కూటీని పొందిన వ్యక్తి మీద ఐదుగురితో మరో ఐదుగురిని 15 వేలు దీంతో మొదటి వ్యక్తికి ప్రతీ సెంబర్ నుంచి రెండు వేల నుంచి కమిషన్‌గా ఇస్తున్నారు. మొదటి దఫాలో ఐదుగురిని జాయిన్ చేసి నట్లయితే మొత్తం 25 మంది నుంచి రెండు వేల చొప్పున రూ.50 వేల కమిషన్ రావడంతో స్కూటీని ఉచితంగా ఇస్తున్నారు. దీంతో మొదటి వ్యక్తికి 95 వేల నుంచి లక్ష రూపాయలు ఆదాయం వస్తుంది. ఈ విధంగా సభ్యుల సంఖ్య పెరిగిన కొద్దీ ఆదాయం పెరుగుతుంది. ఒకవేళ సెంబర్‌గా చేరిన వ్యక్తి ఐదుగురు వ్యక్తులను చేర్పించకపోతే 15 వేల డబ్బులు వదులుకోవాల్సి వస్తున్నది.

● నాసిరకం పంట కడుతున్నారు

కొన్ని నాసిరకం స్కూటీల తయారీ కంపెనీలు ఈ వ్యాపారానికి తెర లేపారు తమ వాహనాలను విక్రయిస్తే ఆకర్షణీయమైన బహుమతులు అనుకోవచ్చని అంటున్నారు. విదేశీ టూర్ సైతం ఉంటాయని చెబుతున్నారు. కాగా ఇలాంటి అనుమతులు లేకుండా జోరుగా ఈ వ్యాపారం కొనసాగుతున్నది.

● ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు: సీఐ

గొలుసు కట్టు స్కూటీ వ్యాపారంపై ఫిర్యాదులు వస్తే విచారించి కేసు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అమాయకులు మోసపోవద్దని ఆయన సూచించారు. ఇంతవరకు ఈ వ్యాపారం విషయమై తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

గంగస్నానానికి బయలుదేరిన భీమన్న దేవుడు


గంగ స్నానానికి బయలుదేరిన భీమన్న దేవుడు

నేరడిగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం గ్రామంలో కొలువైన భీమన్న దేవుడు సోమవారం గంగ స్నానానికి బయలుదేరారు. ప్రతి యేటా మాఘ మాసంలో మాఘ పూర్ణిమ రోజు భీమన్న పండుగను గనంగా జరుపుకోవడం అనవాయితీ. ఈ నెల 12న బుగ్గరాంలో జాతర నిర్వహించగా మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రత్యేక పూజలు చేయడం వల్ల వారి కుటుంబాల్లో సుఖ శాంతులు నెలకొంటాయని వారి నమ్మకం. జాతర సందర్భంలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టింది.

మాయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు

మైలారపు అడెల్లు క్షేమమేనా..!?

● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జోరుగా చర్చ
● ఇంకా ధ్రువీకరించని పోలీసులు


మైలారపు అడెల్లు (ఫైల్)

బోథ్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతుండగా.. రెండు రోజుల క్రితం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల గుర్తింపు ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న అడెల్లు మృతి చెందాడన్న కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అడెల్లు క్షేమంగా ఉన్నాడా..!? లేని పక్షంలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడా!? అన్న చర్చ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా జోరుగా సాగుతోంది.

● 30 సంవత్సరాలుగా అజ్ఞాతంలో..

కేంద్ర కమిటీ సభ్యుల కొనసాగుతున్న మైలారపు అడెల్లు పదో తరగతి చదువుతున్న సమయంలో మావోయిస్టులో చేరాడు. జిల్లా కమిటీ సభ్యుడిగా, కార్యదర్శిగా పనిచేసిన ఈయన గత 30 సంవత్సరాల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి అడెల్లు లొంగిపోతాడన్న ప్రచారం జరిగింది. కరోనా సమయంలో లొంగిపోతాడని జోరుగా ప్రచారం జరిగింది. కొంత మంది పోలీసు అధికారులు సైతం ఆయన లొంగు తాడని భావించారు. కానీ చివరి క్షణాల్లో అడెల్లు లొంగిపోకపోవడంతో.. అంతా ఆశలు వదులుకున్నా రు. మరోవైపు.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ప్రస్తుతం వ రుస ఎన్‌కౌంటర్‌లు కొనసాగుతున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగినప్పుడల్లా అందులో అడెల్లు ఉన్నాడన్న వదం తులు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం బీజా పూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ అడెల్లు మృతి చెంది ఉంటాడని కథనాలు వెలువడ్డాయి. కానీ ఆదిలాబాద్ జిల్లా పోలీసులు మాత్రం ఈ విషయాన్ని ఇప్పటివరకు ధ్రువీకరించడం లేదు. ఏది ఏమైనా చత్తీస్‌ఘడ్ రాష్ట్ర పోలీసులు ధృవీకరించేంత వరకూ ఏ విషయమూ తాము చెప్పబోమని జిల్లా పోలీసు అధికారులు చెబుతున్నారు.

● అడెల్లు తలపై 25 లక్షల రివార్డు

మావోయిస్టు మైలారపు అడెల్లు తలపై ప్రభుత్వం 25 లక్షల రూపాయల రివార్డు ప్రకటించింది. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా అడెల్లు ఆచూకీ కోసం వేట కొనసాగుతూనే ఉంది. పలు దఫాలుగా పోలీసు అధికారులు ఆయన లొంగుబాటుకు కుటుంబీకుల ద్వారా పిలుపునిచ్చినా కూడా ఫలితం లేకుండా పోయింది.

స్వచ్ఛ నిర్మల్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ● ఖానాపూర్ మండలంలో విస్తృత పర్యటన
● ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడి ● మస్కాపూర్ కేజీబీవీలో తనిఖీ


ఖానాపూర్‌లోని పదో వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్


మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖానాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాను స్వచ్ఛ నిర్మల్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఖానాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని మస్కాపూర్, సత్తెనపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 10 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్య పచ్చదనం పెంపొందేలా చర్యలు చేపట్టాలని ఆమె అధి కారులను ఆదేశించారు. ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో పర్యటించిన కలెక్టర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి వార్డుల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. పారిశుధ్య కార్మికులు మురికి కాలువలను శుభ్రం చేసిన తర్వాత ఆయా వార్డుల్లోని ప్రజలతో సంబంధిత రిజిస్టర్‌లో సంతకాన్ని తీసు కోవాలన్నారు. వార్డులో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, మెరు గైన పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం అవసరమన్నారు. ఎ ప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, పొదలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 9వ వార్డు సమీపంలో గల బొడ్డోని కుంటను పరిశీలించిన కలెక్టర్ మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో కుంట చుట్టూ మొక్కలు నాటి ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కుంటలో మురికి నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందడం ద్వారా అనేక రకాల రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మస్కాపూర్ కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. కేజీబీవీలోని వంటగది, సరుకుల నిల్వ గది, విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేశారు. కేజీబీవీ పరిసరాల్లో నిరంతరం పారిశుద్ధ్యాన్ని కొనసాగించాలన్నారు. రాత్రి వేళలో సరైన లైటింగ్ ఉండే విధంగా చర్యలు తీసు కోవాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఎప్పటికప్పుడు చదవాల్సిన సిలబస్ పూర్తి చేసుకుంటూ మంచి ఫలితాలను సాధించాలన్నారు. సత్తెనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన శ్రమదాన కార్యక్ర మం లో అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని పిచ్చి మొక్కలను తొల గించి, పరిసరాలను శుభ్రం చేశారు. సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉం చాలన్నారు. నర్సరీ నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్‌ను తనిఖీ చే శారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో డీఈవో పి.రామారావు, డీపీవో శ్రీనివాస్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ సుజాత, సీపీవో జీవరత్నం ఉన్నారు.


కుంటాలలో గజ్జలమ్మ కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా గజ్జలమ్మ కల్యాణం

కుంటాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల భక్తుల ఇలవేల్పు కుంటాల గజ్జలమ్మ కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నిత్యనిధి మహాయజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గజ్జలమ్మ కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నలుమూలల నుంచే కాకుండా కుంటాల గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గజ్జలమ్మ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం గ్రామం ప్రధాన వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవంలో యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

భద్రాద్రి రామయ్య చెంత.. దిలావర్‌పూర్ బాలికల నృత్య ప్రదర్శన


భద్రాచలంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన దిలావర్‌పూర్ బాలికలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచల రామదాసు 392వ జయంతి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో భద్రాచలంలో దిలావర్‌పూర్‌కు చెందిన బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామానికి చెందిన ధాత్రిక శ్రీవల్యా, జంగం ఆరాధ్య, కదం సరక్షి, గాన్నిక్ రెడ్డి, ఏలేటి అశ్వి ని, నల్ల ఆద్య, వేదాన్షిలు నృత్య ప్రదర్శనలు చేశారు. నిర్మల్ పట్టణంలోని స్వరూపిణి నృత్య కళాక్షేత్రం నాట్య గురువు నవ్య వినయ్ కుమార్ ఆధ్వర్యంలో వీరు భద్రాచలం వెళ్లి నృత్య ప్రదర్శన చేశారు.

నడి రోడ్డుపై విద్యుత్ స్తంభం


నడి రోడ్డు మీద ఉన్న విద్యుత్ స్తంభం దృశ్యం

కడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల తప్పిదమా లేక కాంట్రాక్టర్ తప్పిదమా తెలియదు. చిత్రంలో కనిపిస్తున్న కడెం మండల కేంద్రంలో మహమ్మదియా మసీదు వెనుకాల పాక రాజయ్య ఇంటి ముందు నడి రోడ్డు మీద ఉన్న ఈ విద్యుత్ స్తంభం అధికారుల దృష్టికి రాకపోవడం దురదృష్ట కరం. నడి రోడ్డు మీద ఉన్న ఈ వి ద్యుత్ స్తంభాన్ని పక్కకు జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయది విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

● శాస్త్రోక్తంగా చండీహోమం, పూర్ణాహుతి
● భారీగా తరలివచ్చిన భక్తజనులు
● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భైంసా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని భాగ్యనగర్ కాలనీ పరిధిలో సోమవారం అభయాంజనేయ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఉదయం వేళలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాహలం మధ్య నేత్ర పర్వంగా పారంభమైన గణపతి, దేవి, వల్లీ దేవ సేన సహిత సుబ్రహ్మణ్య, మహాలింగ నంది, అంజనేయాది విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు మధ్యాహ్నం వేళ వరకు కొనసాగాయి. రెండు రోజులుగా శ్రీ అభయాంజనేయది విగ్రహాలకు జల, పుష్ప, ధాన్య, శయ దివాస్ పూజలను గావించిన పండితులు సోమవారం ఉదయం ఆలయంలో ప్రతిష్ఠాపన పూజలను చేపట్టారు.అనంతరం ఆలయ ప్రవేశ మార్గంలో నవ విగ్రహాలను, మందిర ప్రవేశ మార్గంలో మహాలింగ నంది విగ్రహాలను, లోపలి భాగంలో గణపతి, దేవి, శ్రీ వల్లి దేవ సేన సహిత సుబ్రహ్మణ్య, అంజనేయ స్వామి విగ్రహాలకు శాస్త్రోక్తంగా స్థాపన గావించారు. శిఖర, ధ్వజ స్తంభ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన విగ్రహాలకు కాలనీవాసులు శోభాయమానంగా అలంకరించి తొలిపూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో పూర్ణహుతి చేపట్టారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంఘాల బాధ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు.


ప్రతిష్ఠాపనోత్సవ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో కాలనీవాసులు

● భారీగా తరలివచ్చిన భక్తజనం

అంజనేయాది విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంతో పాటు భాగ్యనగర్ కాలనీ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయి కనిపించాయి. విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ఆంజనేయ నామస్మరణ చేపడుతూ భక్తులు పరవశించిపోయారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యారు. ప్రతిష్ఠాపనోత్సవాలు ముగిసిన అనంతరం ఆలయ కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ నయనం నృత్య కళా నిలయానికి చెందిన చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. అంజనేయ చరితం, సుబ్రహ్మణ్య స్వామి విశిష్టతలు నందిపూజ ప్రత్యేకతలు తదితర వాటి గురించి వివరించే గేయాలకు కళానిలయం డైరెక్టర్ డా. రంగు సౌమ్య సంపత్ నేతృత్వంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలకు వన్నె తెచ్చాయి.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 : కనిష్ఠం 19.5
నిర్మల్
జిల్లా వార్తలు


మంగళవారం 11 ఫిబ్రవరి 2025

అనాథ పిల్లలను వసతిగృహంలో చేర్పించిన అధికారులు

ముథోల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ అభిలాష అభినవ్, ఉపపాలన అధికారి ఫైజాన్ అహ్మద్, బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు ముథోల్ మండలంలోని అష్ట గ్రామంలో ఉన్న నిమ్మ గంగాధర్(14), నిమ్మ పుష్ప(11) ను సోమవారం సంబంధిత అధికారులు వసతిగృహంలో చేర్పించారు. భైంసాలోని శ్రీ వివేకానంద ఆవాసంలో, బాలుడు నిమ్మ గంగాధర్‌ను నిర్మల్‌లోని బాలసదనం వసతి గృహంలో బాలిక నిమ్మ పుష్పను చేర్పించినట్లు బాలల సంక్షేమ సమితి మెంబర్ సల్ల శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, సిబ్బంది సగ్గం రాజు, లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్ దేవిబాయి, మాజీ సర్పంచ్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



అటవీ విస్తీర్ణం అయోమయం

- జిల్లాలో గణనీయంగా తగ్గుతున్న అటవీ సంపద
- ప్రభావం చూపని గత హరితహారం
- ఆందోళన రేకెత్తిస్తున్న నివేదికలు

నిర్మల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అడవుల జిల్లాగా పేరున్న ఉమ్మడి ఆదిలాబాద్‌లో క్రమంగా అటవీవిస్తీర్ణం తగ్గిపోతుండడం ఆందోళన రేకెత్తిస్తోంది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం పథకం కింద కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలపైన గందరగోళం నెలకొంటోంది. హరితహారం కార్యక్రమం ద్వారా అటవీవిస్తీర్ణం పెరగాల్సింది పోయిదానికి విరుద్ధంగా అడవులు కనుమరుగైపోతుండడం ఆవేదన కలిగిస్తోంది. దట్టమైన కీ కారణ్యం, వాగులు, వంకలు, సెలయేర్లతో ఆకుపచ్చని ప్రపంచాన్ని ఆవిష్కరింపజేసే ఆదిలాబాద్ జిల్లాలో పోడు సాగుతో పాటు అక్రమంగా చెట్ల నరికి వేత, స్మగ్లింగ్ అలాగే వరదల కారణంగా అడవులు అంతరించిపోతున్నాయి. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్‌ఎఫ్‌ఆర్) ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టినట్లు వెల్లడవుతోంది. ఒక్క మంచిర్యాల జిల్లాలో మినహా ఆదిలాబాద్, నిర్మల్, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో అటవీ విస్తీర్ణం శాతం తగ్గిపోయినట్లు ఐఎస్‌ఎఫ్‌ఆర్ నివేదిక వెల్లడిస్తోంది. గత ఐదారేళ్ల నుంచి ఇక్కడి అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర అటవీ, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో ఫీల్డ్ బేస్డ్ సర్వే ఆధారంగా రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ డాటాతో ఈ అడవుల విస్తీర్ణాన్ని నిర్ధారించారు. ఈ లెక్కల ప్రకారం నిర్మల్ జిల్లాలో 45.37 చదరపు కిలో మీటర్లు, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 44.61 చదరపు కిలోమీటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 115.50 కిలో మీటర్ల విస్తీర్ణం తగ్గిపోయినట్లు ఆ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అయితే మంచిర్యాల జిల్లాలో మాత్రం సింగరేణి సంస్థ చేపట్టిన మొక్కల పెంపకం కారణంగా అడవుల విస్తీర్ణం పెరిగినట్లు ఆ రిపోర్ట్‌లో వెల్లడించారు. మూడు జిల్లాలకు భిన్నంగా మంచిర్యాల జిల్లాలో మాత్రం 34.96 చదరపు కిలో మీటర్ల అడవి పెరిగినట్లు ఆ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఇలా ఉండగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 1778.26 చదరపు కిలోమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 1564.93 చదరపు కిలో మీటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 1145.76 చదరపు కిలోమీటర్లు, జిల్లాలో 1085.02 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.





ఖానాపూర్ అడవుల్లో కోతకు గురై తరలించడానికి సిద్ధంగా ఉన్న కలప

తగ్గని అడవుల నరికివేత

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అడవుల నరికి వేత వ్యవహారం ఇంకా సద్దుమనగడం లేదు. కలప అవసరాల కోసం కొంతమంది స్మగ్లర్లు యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలోని ఓ గ్రామంలో చెట్లను నరికి వేసి కలపను భద్రపరిచిన ఇళ్లపై అటవీ శాఖ అధికారులు తనిఖీలు చేయగా స్మగ్లర్లు వారిపై తిరగబడి దాడి చేసిన సంగతి తెలిసిందే. అటవీ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ అలాగే నిఘా సారిస్తూ స్మగ్లింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ కొన్ని మారుమూల గ్రామాల్లో మాత్రం చెట్ల నరికి వేత మాత్రం ఆగడం లేదు. పోడు వ్యవసాయం కోసం నిరంతరం చెట్ల నరికి వేత కొనసాగుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. నిర్మల్ జిల్లాలోని కడెం, పెంబి, ఖానాపూర్, దస్తురాబాద్ అడవుల్లో సైతం కొంతకాలం క్రితం వరకు పెద్ద ఎత్తున చెట్ల నరికివేత కొనసాగినట్లు ఫిర్యాదులున్నాయి. నిర్మల్ జిల్లాలో కూడా గతంలో పలు సార్లు అటవీ శాఖ అధికారులపై స్మగ్లర్లు దాడులు చేసిన సంగతి కూడా తెలిసిందే. అటవీ శాఖ చెట్ల నరికి వేతను నిరోధించి స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఇన్ ఫార్మింగ్ నెట్వర్క్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదంటున్నారు. కొన్ని మారుమూల పల్లెల పరిధిలోని అడవుల్లోనే విస్తీర్ణం క్రమంగా తగ్గుముఖం పడుతుందని చెబుతున్నారు.

హరితహారం అయోమయం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారం కార్యక్రమం ఆశించిన ఫలితం ఇవ్వలేదన్న విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 కోట్ల మొక్కలు నాటినట్లు సంబంధిత శాఖల అధికారులు వెల్లడిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ మొక్కల లెక్కలపై అయోమయం నెలకుంటోంది. ఇంత పెద్ద మొత్తంలో మొక్కలు నాటితే అడవుల విస్తీర్ణం గణనీయంగా పెరగాలి గాని తగ్గిపోవడమేమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని కొన్ని మారుమూల అటవీ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూడా చెట్లు నేలకొరిగి పోతున్నాయన్న వాదనలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఇక్కడి బ్లాక్ సాయిల్‌తో కూడా చెట్లు వరద పాలవుతున్నాయంటున్నారు.



విద్యార్థులకు టైక్వాండో గ్రేడింగ్ పరీక్ష



విద్యార్థులకు బెల్ట్ ప్రదానం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవి, శ్రీ చైతన్య విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు ఏకేఎస్ అకాడమీ కోచ్ దయత్ అక్షయ్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు కళ్ళకు గంతలు కట్టుకొని చేసిన ప్రదర్శన చాలా అద్భుతం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్, రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ వహాజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కడెం రోడ్డు ఊడ్చిన డీఆర్డీవో పీడీ



రోడ్డు ఊడుస్తున్న డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి

కడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మార్కెట్ ప్రాంతంలో స్వయంగా ఊడ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి సమీపంలో పిచ్చిమొక్కలు పెరుగకుండా చూసుకోవాలని ప్రజలను కోరారు.

నర్సరీల్లో పెంచే ప్రతి మొక్కను కాపాడేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కడెం, కొండుకూర్, కన్నాపూర్, పాండ్వాపూర్ గ్రామాల్లోని నర్సరీలను ఆమె సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏపీవో జయదేవ్, పంచాయతీ కార్యదర్శి మునీర్ ఉల్ హాసన్, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ముథోల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముథోల్ ఎంపీడీవో శివకుమార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని అష్ట, విట్టోలి, విట్టోలి తాండ, బ్రహ్మన్‌గాం గ్రామాల్లో పర్యటించారు.

ఆత్మహత్యా యత్నాన్ని

అడ్డుకున్న పోలీసులు



సురేఖను కాపాడుతున్న పోలీసులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని లక్ష్మీనగర్ తండాకు చెందిన ఎం. సురేఖ(28) లోకేశ్వరంలోని భగీరథ చెరువులో పడి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఎం. సురేఖ గత 12 సంవత్సరాల క్రితం లక్ష్మీనగర్ తండాకు చెందిన మౌలా అనే అతనితో వివాహం జరిగింది. వారికి నలుగురు పిల్లలు సంతానం. సురేఖ మొబైల్ ఫోన్ చెడిపోగా దాన్ని రిపేర్ చేయించడానికి లోకేశ్వరంలోని ఒక రిపేర్ షాప్‌లో ఇవ్వగా దానికి 1500 రూపాయలు ఖర్చు అవుతుందని అట్టి డబ్బులను ఇవ్వమని భర్తను కోరగా అట్టి డబ్బులు నా బైక్ రిపేర్ కోసం అవసరం ఉందని చెప్పగా దానితో మనస్థాపం చెందిన సురేఖ సోమవారం రోజున సాయంత్రం మూడు గంటల సమయంలో లోకేశ్వరం చెరువులో దూకడానికి ప్రయత్నించగా అక్కడ ఉన్న జాలర్ల సహాయంతో లోకేశ్వరం పోలీసుస్టేషన్‌కు సంబంధించిన బ్లూ కోర్టు కానిస్టేబుల్స్ ఆర్. రాజ్ కుమార్, హుస్సేన్‌లు కాపాడి పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా ఎస్సై జి.అశోక్ ఆమెకు కౌన్సిలింగ్ చేసి ఆమె భర్తకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక నిండు ప్రాణాన్ని కాపాడారని కొనియాడారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలి

కుంటాల, ఫిబ్రవరి, 10 : (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎంపీ వైద్యులకు శిక్షణ అందించాలని ఆర్‌ఎంపీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలలో ఆర్‌ఎంపీ వైద్యుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యులకు ప్రభుత్వం శిక్షణ అందించాలని, అలా కాకుండా టీఎంసీ దాడులతో అక్రమ కేసులు పెట్టడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్‌ఎంపీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నవీన్, ఉపాధ్యక్షులు నరేష్, మాజీ అధ్యక్షుడు రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకడ్రైవ్

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు టెంబుర్ని, రాంపూర్ పారిశుధ్యంపై ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... గ్రామంలోని పారిశుధ్యంలో పాల్గొన్నారు. పనులు చేసిన తర్వాత ఫోటోలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. గ్రామంలోని ప్రతీవాడలో చెత్త లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కైలాస్ నవనీత్, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞాన సంపదతోనే దేశాభివృద్ధి

- వికసిత్ భారత్ ప్రపంచానికే ఆదర్శం : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

నిర్మల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానసంపదతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, భారత దేశ జ్ఞానసంపద ప్రపంచానికే దిశా నిర్దేశం చేసిందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నిర్మల్‌లోని వేడుకలకు ఇంద్రసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట ఆయనకు నిర్మల్‌లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ లోక్‌సభ ఇన్‌చార్జీ అయ్యన్నగారి భూమయ్య, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో త్రిపుర గవర్నర్ మాట్లాడుతూ... ముందు తరంలో భారతదేశం అపారమైన జ్ఞానసంపదతో వెల్లివిరిసిందన్నారు. అనంతరం బ్రిటిష్ పాలకులు దేశ జ్ఞానసంపదను నాశనం చేసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారన్నారు. దేశ సంపదను బ్రిటిష్ పాలకులు కొల్లగొట్టారన్నారు. 2047లో భారతదేశం అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగి వికసిత్ భారత్ అవతరిస్తుందన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉత్తములుగా ఎదిగితేనే వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. దేశ అభివృద్ధిలో విద్యారంగంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేయాలని సూచించారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వారిని వివిధ రకాల కోర్సుల్లో చదివించాలని వారిపై ఎలాంటి ఒత్తిళ్లు తేవద్దన్నారు. తల్లి దండ్రుల అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులను చదివించవద్దని ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆసక్తిని గమనించి వారిని వారు కోరుకున్న దిశలో ముందుకు నడపాలని కోరారు. తమ పిల్లలను ఇతరులతో పోల్చవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షలు అంటే భయం పోగొట్టాలని, పరీక్షలు మామూలు చదువులో భాగమేనన్న అభిప్రాయాన్ని కలిగించాలని కోరారు. విద్యార్థులపై ఉపాధ్యా యుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఆదర్శంగా, స్ఫూర్తిదా యకంగా ఉన్నప్పుడే ఉత్తమ విద్యార్థులు తయారవుతారన్నారు. 21 శతాబ్దమంతా భారత దేశ శతాబ్దమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, చంద్ర గౌడ్, స్కూల్ కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, ఆమెడ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌ను సన్మానించిన బీజేఎల్పీ నేత ఏలేటి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం నిర్మల్‌లోని రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో శాలువాతో సన్మానించారు. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఆయన నిర్మల్‌కు రాగా.. ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. తన స్వగృహంలో ఇచ్చిన విందులో ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం రాకెట్ గుట్టురట్టు

- లారీ, టాటా మ్యాజిక్ వాహనాల సీజ్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డా. జానకీ షర్మిల



సీజ్ చేసిన లారీ, టాటా మ్యాజిక్ వాహనాల వద్ద ఎస్పీ, ఏఎస్పీలు

భైంసా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని ధర్మబాద్ కేంద్రంగా నడుస్తున్న రేషన్ బియ్యం రాకెట్‌ను జిల్లా పోలీసులు గుట్టురట్టు చేశారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో ఎస్పీ డా. జానకీ షర్మిల విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదిన రాత్రి భైంసాలోని శివాజీ చౌక్‌లో క్రాస్ అవుతున్న ఓ కారును 16 టైర్ల లారీ ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌ను విచారించగా.. పొంతలేని సమాధానం ఇవ్వడంతో అనుమానం వచ్చిన పోలీసులు లారీని తనికీ చేశారు. అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి తనకు సమాచారం అందిందన్నారు. వెంటనే భైంసా, నిర్మల్ ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనాలను బృందంగా ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. లారీలో ఉన్న 36 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసి జిల్లా పౌరసరఫరాల శాఖకు అప్పగించామన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోని విచారించగా మహారాష్ట్రలోని ధర్మబాద్‌కు చెందిన అబ్దుల్ రవుఫ్ అనే వ్యక్తి ఈ బియ్యం రాకెట్ దందా కొనసాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ తర్వాత 9వ తేదిన బాసర మండలం బిద్రెల్లి వద్ద మహారాష్ట్ర బార్డర్‌లో వాహనాలు తనికీ చేస్తుండగా.. టాటా మ్యాజిక్ వాహనంలో రేషన్ బియ్యం ధర్మబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ధర్మబాద్‌లో మహారాష్ట్ర పోలీసుల సహకారంతో రవుఫ్ గోదాముపై దాడి చేసి 40 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే భైంసాలో పట్టుబడిన లారీలో రేషన్ బియ్యం రిసైక్లింగ్ అయి మహారాష్ట్రకు వెళ్తున్నట్లు గుర్తించామన్నారు. అబ్దుల్ రవుఫ్‌తో సంబంధాలు ఉన్న లక్ష్మణచాంద మండలంలోని హన్మంత్ రెడ్డి రైస్‌మిల్లులో దాడులు చేయగా.. కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న వడ్ల ట్రక్కులను రెండును సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వెల్లడించారు. పీడీఎస్ బియ్యం రాకెట్ కేసులో ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేయడంతో పాటు లారీ, టాటా మ్యాజిక్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసును చేధించడంలో కీలక పాత్ర పోశించిన ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనాలను అభినందించారు. ఇందులో సీఐలు నైలు, మల్లేష్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల విభాగం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో ఆమె పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్సై, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారానికి సూచనలు చేసినట్లు తెలిపారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చండీగఢ్‌లోని కళ్యాణ రాజ్ భవన్‌లో గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిసినట్లు బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ తెలంగాణ విషయాలపై చర్చించినట్లు తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



పారిశుధ్యంపై అవగాహన కలిగిస్తూ.. చెత్తను తొలగిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఈ నెల 15వ తేదీ వరకు అధికారులు నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నిర్మల్ పట్టణంలోని 3వ వార్డు రామ్‌రావ్ బాగ్, 33వ వార్డు భాగ్యనగర్ కాలనీలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా సంఘాల మహిళలు రోడ్లపై చెత్తను తొలగించారు. పారిశుధ్య కార్మికులు మురికి కాలువల్లోనిచెత్తను తొలగించి శుభ్రం చేశారు. మురికి కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఆయా వార్డుల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కలిగే ర్యాలీలను నిర్వహించారు. వార్డు ప్రజలతో అధికారులు మాట్లాడుతూ... వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. ఇళ్లలో తప్పనిసరిగా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ప్రత్యేక అధికారి మోహన్‌సింగ్, మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవదాసు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.